సాక్షి
నల్లగొండ
శుక్రవారం । 27 । జనవరి । 2023



రేపటి నుంచి చెర్వుగట్టు జాతర
చెర్వుగట్టులో శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. - 10లో



వీఆర్ఎస్ తీసుకోవడం ఖాయం
రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ వీఆర్ఎస్ తీసుకోనుందని మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. - 10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32°/16°
ఆకాశం నిర్మలంగా ఉంటుంది రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన నూతన ఎస్పీ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : ఎస్పీగా అపూర్వ రావు గురువారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్పీగా పనిచేసిన రెమా రాజేశ్వరి రామగుండం సీపీగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలు, మహిళల రక్షణ కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంఘ విద్రోహ చర్యలను అణిచివేస్తామని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూచించారు.

ఆర్టీసీ ఆర్ఎంగా శ్రీదేవి



ఆర్ఎంగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీదేవి

నల్లగొండ రూరల్ : ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆర్టీసీ ఆర్ఎంగా శ్రీదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన వరప్రసాద్ హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహించిన శ్రీదేవి నల్లగొండ ఆర్ఎంగా బాధ్యతలు చేపట్టారు. ప్రయాణికుల, ఉద్యోగుల సంక్షేమానికి కోసం కృషి చేస్తానని ఆమె తెలిపారు.

యువత అన్ని రంగాల్లో దేశాన్ని నడిపించాలి



మాట్లాడుతున్న వీసీ గోపాల్‌రెడ్డి

ఎంజీయూ(నల్లగొండ రూరల్) : దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపించాల్సిన బాధ్యత యువతపై ఉందని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం యూనివర్సిటీలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు కొత్త ప్రణాళికలతో యూనివర్సిటీని ముందుకు నడిపించాలని కోరారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

బీసీ కులగణన చేపట్టాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

నార్కట్‌పల్లి : బీసీ కులగణన త్వరలో చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టకపోతే ఫిబ్రవరి 2నుంచి అమరావతి – హైదరాబాద్ వరకు బీసీ రథయాత్ర నిర్వహిస్తామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా బీసీలు చైతన్యవంతులై బీసీ కులగణనపై పోరాటం చేయాలన్నారు. సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరికుప్పల మధు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సింగం నరేష్, మహేష్ భరత్, బీసీ సంఘం జిల్లా కార్యదర్శి వేముల నరసింహ, వడ్డగోని నర్సింహ, బోయపల్లి శ్రీనివాస్, వేముల సత్తయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

లక్ష్మీనరసింహులకు నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం నిత్యకల్యాణ వేడుక ఆచార్యులు సంప్రదాయంగా జరిపించారు. వేకువజామునే సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి, తులసీ దళాలతో అర్చించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి పూజలు చేపట్టారు. సాయంత్రం జోడు సేవోత్సవం, సహస్రనామార్చన, రాత్రి శయనోత్సవం నిర్వహించారు.

అన్నింటా ప్రగతి



జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, ఎస్పీ రెమా రాజేశ్వరి తదితరులు



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

- ప్రజా సంక్షేమానికి వినూత్న పథకాలు అమలు
- వ్యవసాయ అనుబంధ రంగాలకు పెద్దపీట
- మిషన్ భగీరథ ద్వారా రూ.2,941 కోట్లతో 4,02,248 గృహాలకు నల్లా కనెక్షన్లు
- 74వ గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నల్లగొండ : రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో వినూత్న పథకాలు ప్రారంభించిందని, వీటిని ప్రజలకు అందించేందుకు జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం 74వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను కలెక్టర్ వివరించారు.

నీటి పారుదల శాఖ ద్వారా..

సాగర్ ఎడమ కాలువ ద్వారా గత వర్షాకాలంలో 1,45,330 ఎకరాలకు నీరు అందించినట్లు తెలిపారు. ఏఎంఆర్పీ హై లెవల్, లో లెవల్ కెనాల ద్వారా 2,46000 ఎకరాలకు, ఆసిఫ్‌నగర్ ప్రాజెక్టు ద్వారా 15,245 ఎకరాలకు, డిండి మీడియం ఇరిగేషన్ ద్వారా 12,975 ఎకరాలకు, మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద 24,525 ఎకరాలకు నీరు అందించామన్నారు. ఈ సీజన్‌లో కూడా ఈ ప్రాజెక్టుల కింద నీరు అందించేందుకు సిద్ధమవుతున్నామన్నారు. ఎస్ఎల్‌బీసీ స్వరంగ మార్గం పనులు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటికే 2355 కోట్ల రూ. ఖర్చు చేసినట్లు తెలిపారు. ఉదయం సముద్రం ఎత్తిపోతల పథకం పనులు, డిండి ఎత్తిపోతల పథకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. ఆ ప్రాజెక్టు పరిధిలో రిజర్వాయర్ల పనులు కొన్నిచోట్ల పూర్తి కాగా మరికొన్ని చోట్ల పురోగతిలో ఉన్నాయన్నారు.

గొర్రెల పంపిణీకి రూ.356కోట్లు

జిల్లాలో ఇప్పటివరకు 28,234 యూనిట్ల గొర్రెలను లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు రూ.356 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. రెండోవిడత కొనసాగుతుందని జిల్లాలో 36,500 యూనిట్లు అందించాలని ఆదేశాలు ఉన్నాయని తెలిపారు.



మత్స్యకారులను ఆదుకునేందుకు..

మత్స్యకారులను ఆదుకునేందుకు నూరు శాతం రాయితీపై 1,005 చెరువుల్లో రూ.5కోట్ల61లక్షల 51వేల చేప పిల్లలను వదిలామని పేర్కొన్నారు. పీఎం మత్స్య సంపద సమృద్ధి యోజన పథకం కింద 14 మంది లబ్ధిదారులు 19.65 హెక్టార్లలో కొత్త చేపల చెరువుల నిర్మాణం, చేపల విత్తనాల ఆచరీస్ నిర్మాణ పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు.

గృహ నిర్మాణాలకు..

జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో 1,400 చొప్పున మొత్తం 8,155 డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించేందుకు రూ.375 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఇప్పటికి 2,981 గదులు పూర్తయ్యాయని అందులో 210 గృహాలను లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. అదేవిధంగా మిషన్‌భగీరథ ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రూ.2941 కోట్లు ఖర్చు చేసి 1718 ఆవాసాల్లో 4,02,248 గృహాలకు నల్లా కనెక్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు.

రోడ్ల అభివృద్ధికి..

జిల్లాలో రెండు వరుసల రహదారి సౌకర్యాం లేని మండలాలను జిల్లా కేంద్రంతో అనుసంధానం కోసం, ఇతర ప్రధాన రహదారులను రెండు లైన్లుగా అభివృద్ధి చేసేందుకు రూ.339 కోట్లు మంజూరు చేశమన్నారు. జిల్లా పరిషత్‌కు సంబంధించి 2022–23 సంవత్సరానికి రూ.5.26 కోట్ల నిధులు విడుదలయ్యాయన్నారు. ప్రాథమిక పశువైద్య కేంద్రాలు, ఉప కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, కాలువల నిర్మాణం కోసం 3.71 కోట్ల నిధులు విడుదలయ్యాయని తెలిపారు.

వ్యవసాయానికి 24 గంటల విద్యుత్

వ్యవసాయానికి 24గంటల విద్యుత్ అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 2,21,879 మంది వ్యవసాయదారులు లబ్ధిపొందుతున్నారని తెలిపారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు 6476 కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను ఇచ్చినట్లు చెప్పారు. పల్లె ప్రగతి ద్వారా విద్యుద్దీకరణ పనులు కూడా పూర్తి చేశామన్నారు. టీఎస్ ఐపాస్ చట్టం కింద 2022–23లో వివిధ శాఖల నుంచి 85 పరిశ్రమలకు 147 అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 110 ప్రాజెక్టులకు రూ.3.51 కోట్లతో మంజూరు చేశామన్నారు. నేతన్న బీమా పథకం కింద 5678 మంది చేనేత, మరమగ్గం కార్మికులకు నమోదు చేయడం జరిగిందని ఇప్పటికే ఏడుగురు మరణించగా నామినీకి రూ.5లక్షలు అందించామన్నారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి..

దేవాదాయ శాఖ పరిధిలో పురాతన ఆలయాల అభివృద్ధికి 21 దేవాలయాలకు రూ.9కోట్లతో పనులు చేపట్టడం జరిగిందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని, మహిళా రక్షణకు షీ టీంలు సమర్థవంతంగా పని చేస్తున్నాయని తెలిపారు.

దళితబంధు ద్వారా రూ.47.29కోట్లు జమ

దళితబంధు ద్వారా జిల్లాలో 517 లబ్ధిదారులకు రూ.51.17లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటివరకు రూ.47.29కోట్లు ఖర్చుచేశామన్నారు. గిరిజన ఓవర్సీస్ పథకం కింద 8 మంది విద్యార్థులకు రూ.80లక్షలు మొదటి విడతగా మంజూరు చేశామన్నారు. అదేవిధంగా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కింద ఉపకార వేతనాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. మోతుకుంటలో రూ.35లక్షలతో మోడ్రన్ మెథానైజెడ్ దోబీగాట్ యూనిట్ ఏర్పాటు చేసిందని చెప్పారు. అదేవిధంగా మైనారిటీ సంక్షేమ శాఖ, ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల ద్వారా పైచదువులకు ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా మన ఊరు – మన బడి కింద 517 పాఠశాలలను ఎంపిక చేసి రూ.175.37 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

రైతుబంధు కింద రూ.504 కోట్లు జమ

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ రంగాలకు పెద్దపీట వేసిందన్నారు. రైతుబంధు పథకం కింద ఇప్పటివరకు రూ.504 కోట్లను 4,60,838 మంది రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. రైతు బీమా కింద ఇప్పటివరకు 455 మంది రైతులు చనిపోగా అందులో 409 మంది కుటుంబాలకు 20.45 కోట్ల రూ. బీమా సంస్థ ద్వారా అందించినట్లు తెలిపారు. ఈ సంవత్సరం వానాకాలం ధాన్యం సేకరణ సమర్థవంతంగా నిర్వహించి 68,367 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి 838 కోట్ల రూ. వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. రైతుల అవసరాల నిమిత్తం 57కోట్ల రూ. 27గోదాములను నిర్మించినట్లు చెప్పారు. ఉద్యాన, పట్టు పరిశ్రమ, ఆయిల్‌పామ్ మిషన్ ద్వారా రాయితీ కల్పిస్తూ జిల్లాలో 3500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటాలని నిర్ణయించి 2023 ఎకరాల్లో మొక్కలు నాటడం జరిగిందన్నారు. సూక్ష్మ నీటిపారుదల పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు నూరుశాతం, బీసీ, సన్నకారు రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80శాతం రాయితీలపై డ్రిప్ పరికరాలు మంజూరు చేసినట్లు తెలిపారు.

ఉపాధి హామీ పథకం ద్వారా..

ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం రూ.89.73 కోట్లు ఖర్చు చేసి 2.68 లక్షల మంది కూలీలకు ఉపాధి కల్పించామన్నారు. ఇప్పటికే 94 ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలు నిర్మించామన్నారు. శ్రీనిధి పథకం కింద జిల్లాలో 661 గ్రామ సమాఖ్యల ద్వారా 4088 స్వయం సహాయక సంఘాల సభ్యులకు 87.97 కోట్ల రుణ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా 11581 సంఘాలకు రూ.709 కోట్ల రుణం మంజూరు చేశామన్నారు. 14256 మంది ఆసరా పెన్షన్ల లబ్ధిదారులకు రూ.50.69కోట్లు ప్రతినెలా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. స్వచ్ఛభారత్ కింద జిల్లాలో 1,15,673 వ్యక్తిగత మరుగుదొడ్లు ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది.

జాన్‌పహాడ్ ఉర్సు ప్రారంభం



గంధం, దట్టీలు తీసుకెళ్తున్న ముజావర్, నిర్వాహకులు

- ఉల్సాతో షురూ అయిన ఉత్సవాలు
- బాబాల సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- నేడు గంధం ఊరేగింపు
- హాజరుకానున్న మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, ఇతర ప్రముఖులు



బాబా సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగిస్తున్న మహిళలు, చిన్నారులు

పాలకవీడు: మత సామరస్యానికి ప్రతీక అయిన పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా ఉర్సు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. గుసుల్ షరీఫ్ (ఉల్సా)తో తొలి ఘట్టం మొదలైంది. మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు దర్గాలోని సైదులుబాబా సమాధులను శుభ్రంచేసి సూర్యోదయానికి ముందే గంధం, నూతన వస్త్రాలు(దట్టీలు), పూలదండలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన హజ్రత్ సయ్యద్ మొహినుద్దీన్ షహీద్(రహ్మతుల్లా అలైహి), హజ్రత్ సయ్యద్ జాన్‌పాక్ షహీద్(రహ్మతుల్లా అలైహి) సమాధులకు గంధం, నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి బాబా సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి బాబాకు నైవేద్యం సమర్పించారు. అనంతరం దర్గా సమీపంలోని నాగేంద్రుని పుట్ట వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పక్కీరుల బృందం ఖవ్వాలీ నిర్వహిస్తూ ముస్లిం సంప్రదాయ పద్ధతిలో భజనలు, పాటలు ఆలపించారు. శుక్రవారం నిర్వహించే గంధం ఊరేగింపు సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు రానున్నందున ఇబ్బందులు కలగకుండా ఆరోగ్య, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఎలక్ట్రిసిటీ, ఫైర్, ఆర్టీసీ, పోలీస్ వారు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. సూర్యాపేట, మిర్యాలగూడ, కోదాడ ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు.

నేడు అశ్వంపై గంధం ఊరేగింపు

ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించే ప్రధాన ఘట్టం గంధం ఊరేగింపు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోంమంత్రి మహమూద్‌అలీ, జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఇతర ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉన్నట్టు దర్గా నిర్వాహకులు తెలిపారు. గంధం ఊరేగింపునకు వేలాదిగా భక్త జనం తరలిరానున్నారు. డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి, హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో 330 మంది పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ నుంచి తీసుకొచ్చిన పవిత్ర గంధాన్ని దర్గా సమీపంలోని సందల్ ఖానాలో ఉంచుతారు. శుక్రవారం ఉదయం ప్రత్యేకంగా అలంకరించిన అశ్వంపై జాన్‌పహాడ్, చెరువుతండా, కల్మేట్‌తండా పుర వీధుల్లో ఊరేగించి తిరిగి ఒంటిగంటకు దర్గా వద్దకు చేర్చుతారు. ఆ సమయంలో పవిత్ర గంధాన్ని తాకేందుకు భక్తుల మధ్య తొక్కిసలాట చోటుచేసుకునే అవకాశం ఉండటంతో పోలీసులు, రోప్ పార్టీల సాయంతో అన్నివైపులా గట్టి నిఘా ఏర్పాటు చేశారు.

బియ్యం ఉత్పత్తిలో నల్లగొండ టాప్

- నల్లగొండ నుంచి 9శాతం బియ్యం ఉత్పత్తి
- పత్తిసాగులోనూ మొదటిస్థానం
- తెలంగాణ స్టాటిస్టికల్ రిపోర్టులో వెల్లడి



నల్లగొండ : బియ్యం ఉత్పత్తిలో నల్లగొండ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా బియ్యం ఉత్పత్తిలో ఆయా జిల్లాల వారీగా పరిశీలిస్తే నల్లగొండ, సూర్యాపేట జిల్లాలు అగ్రస్థానంలో నిలిచాయి. తెలంగాణ వ్యాప్తంగా 134లక్షల మెట్రిక్‌టన్నుల బియ్యం ఉత్పత్తి అయితే అందులో నల్లగొండ జిల్లా నుంచే 9శాతం బియ్యం ఉత్పత్తి అవుతుండగా సూర్యాపేట జిల్లాలో 8.9 శాతం బియ్యం ఉత్పత్తి అవుతున్నట్లు వెల్లడైంది. అంతేకాక జిల్లాలో ఉన్న 15వేల చిన్న తరహా పరిశ్రమల్లో అత్యధికంగా లక్ష మంది ఉపాధి పొందుతున్నారు. ఉపాధి హామీలోనూ అత్యధిక మంది కూలీలు, కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. పత్తి సాగులోనూ నల్లగొండ జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. ఇవన్ని ఇటీవల విడుదల చేసిన తెలంగాణ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్ 2021–22 ద్వారా వెల్లడైంది. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో సాగునీటి వాటా దక్కడంతో వరి సాగు పెద్దఎత్తున పెరిగింది.

అక్షరాస్యతలో 19వ స్థానం..

6 సంవత్సరాలు పైబడిన వారు 14,36,420 మంది ఉండగా అందులో అక్షరాస్యులు 9,15,742 మంది ఉన్నారు. అంటే అక్షరాస్యత 63.8 శాతం మాత్రమే ఉండి రాష్ట్రంలో 19వ స్థానానికి పడిపోయింది. ఇందులో పురుషుల కంటే మహిళల్లో ఎక్కువ నిరక్షరాస్యత ఉంది. పురుషుల్లో 73.9 శాతం అక్షరాస్యత ఉండగా మహిళల్లో 53.5 శాతం మాత్రమే ఉంది.

లింగనిష్పత్తిలో..

ప్రతి వెయ్యి మంది పురుషులకు 978 మంది మాత్రమే మహిళలు ఉన్నారు. జిల్లాలో ఎస్సీ పాపులేషన్ 2,96,951 మంది ఉండి 18.1 శాతం నిష్పత్తితో ఉన్నారు. ఎస్సీ మెయిల్ పాపులేషన్ కంటే మహిళా జనాభానే ఎక్కువగా ఉంది. వెయ్యి మంది పురుషులకు 1007 మంది మహిళలు ఉన్నారు. కాగా.. ఎస్టీ జనాభా 12.9 శాతం ఉంది. లింగనిష్పత్తి పరిశీలిస్తే ప్రతి వెయ్యి మంది పురుషులకు 915 మంది మహిళలు ఉన్నారు. జిల్లాలో 8,06,091 మంది కార్మికులు ఉన్నారు. వ్యవసాయ కూలీలుగా 48.3 శాతం కార్మికులు పని చేస్తున్నారు.

పత్తి సాగులోనూ అగ్రస్థానం..

పత్తి సాగులోనూ నల్లగొండ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. 6,53,768 ఎకరాల్లో పత్తిసాగు చేయగా పెద్ద ఎత్తున దిగుబడి సాధించి మొదటి వరుసలో నిలిచింది. జిల్లాలో మొత్తం జనాభా 16,18,416 ఉండగా అందులో 7,222.78 కిలోమీటర్ల విస్తీర్ణంలో నల్లగొండ జిల్లా ఉంది. జనాభాలోనూ రాష్ట్రంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ తర్వాత అత్యధిక జనాభా కలిగి ఉంది. కాగా.. మొత్తం జనాభాలో గ్రామీణ జనాభానే అధికంగా ఉంది. 12,50,113 మంది ఉండగా పట్టణ ప్రాంతాల్లో 3,68,303 మంది ఉన్నారు. ఇందులో నల్లగొండ 3వ స్థానంలో నిలిచింది. చిన్న పిల్లల పాపులేషన్ 1,81,996 మంది ఉన్నారు.

వాహన రిజిస్ట్రేషన్‌లలోనూ ముందంజ..

జిల్లాలో నేషనల్ హైవే 273.4 కిలోమీటర్లు విస్తరించి ఉంది. పంచాయతీరాజ్ రోడ్డు 5419.89 కిలోమీటర్లు, ఆర్అండ్‌బీ రోడ్డు 1836.43 కిలోమీటర్లు ఉండగా జిల్లాలో మొత్తం రోడ్లు 7,529.376 కిలోమీటర్లు విస్తరించి ఉంది. అదేవిధంగా వాహనాల రిజిస్ట్రేషన్‌లోనూ నల్లగొండ ముందంజలో ఉంది. గత సంవత్సరం 32,238 వివిధ కేటగిరీలకు సంబంధించిన వాహనాలను రిజిస్ట్రేషన్ చేయడంతో నల్లగొండ జిల్లా 5వ స్థానంలో నిలిచింది. విద్యాపరంగా జిల్లాలో అన్ని కేటగిరీలకు సంబంధించి 2,055 పాఠశాలలు ఉండగా ఉపాధ్యాయుల నిష్పత్తి విద్యార్థుల కంటే తక్కువగా ఉంది. డ్రాప్ అవుట్ మాత్రం హైస్కూళ్లలో 16.3 శాతం ఉంది.

భూగర్భ జలాల్లో..

భూగర్భ జలాల్లో నల్లగొండ జిల్లా మొదటిస్థానంలో ఉంది. 2016 నుంచి 2021 వరకు భూగర్భజలాల నీటిమట్టాలను పరిశీలిస్తే యావరేజ్‌గా 9.41 మీటర్లపైనే భూగర్భజలాలు ఉన్నాయి. దీంతో మిగతా జిల్లాతో పోల్చితే నల్లగొండ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. కాగా రైతు బీమాలోనే నల్లగొండ రెండో స్థానంలో నిలిచింది. ఆసరా పింఛన్ల విషయంలోనూ జిల్లా 4వ స్థానంలో ఉంది. ఉపాధి హామీలోనూ నల్లగొండ జిల్లా రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉంది. అత్యధిక మంది కూలీలకు పని కల్పించిన జిల్లాల్లో నల్లగొండ ముందు నిలిచింది.



ట్రాక్టర్ల ర్యాలీలో పాల్గొన్న జూలకంటి, సారంపల్లి, రైతులు

ఇచ్చిన హామీలు అమలు చేయాలి: జూలకంటి

మిర్యాలగూడ : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మిర్యాలగూడ పట్టణంలో గురువారం అఖిల భారత కిసాన్ సభ ఆధ్వర్యంలో రైతులు ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. సంఘం జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సారంపల్లి మల్లారెడ్డి ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. హనుమాన్‌పేట ఫ్లెక్టోవర్ బ్రిడ్జి నుంచి రాజీవ్‌చౌక్ మీదుగా ఈదులగూడెంలోని సుందరయ్య చౌరస్తా వరకు భారీ ర్యాలీ సాగింది. ర్యాలీలో రైతు సంఘం జిల్లా నాయకుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, ముడావత్ రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, పాదూరి శశిధర్‌రెడ్డి, చౌగాని సీతారాములు, పాల్వాయి రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, పరుశురాములు, అయూబ్, ఎండీ అంజద్, గోవర్ధని, వినోద్‌నాయక్, బంటు వెంకటేశ్వర్లు, అంబటి నాగయ్య, జ్వాల వెంకటేశ్వర్లు, శ్రీరామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఉపేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలేరు జెడ్పీ హెచ్‌ఎస్ 1968-69 బ్యాచ్ విద్యార్థులు

ఆలేరురూరల్: ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1968–69 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు గురువారం పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా రూ.2లక్షల ఆర్థికసాయం అందజేస్తామన్నారు. పూర్వ విద్యార్థి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రచయిత బైరపాక స్వామి రాసిన ఆకలి మంటలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయిత స్వామి ఈ పుస్తకాన్ని ఉపేందర్‌రెడ్డి, సుజాత దంపతులకు అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో రాంచంద్రారెడ్డి, పల్లా అంజిరెడ్డి, పల్లా లక్ష్మిరెడ్డి, లక్ష్మినర్సయ్య, పెండ్యాల సత్తయ్య, పెండం సత్తయ్య, మోహన్‌రెడ్డి, బత్తుల యాదగిరి, ఇంద్రసేనారెడ్డి, దేవేశ్వరసింగ్, దశరథ, వి.రాములు, పోరెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర చట్టం తీసుకురావాలి

- సీపీఎం ఆధ్వర్యంలో ట్రాక్టర్ ర్యాలీ

నల్లగొండ టౌన్: రైతులు పండించి పంటలకు మద్దతు ధర ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని తీసుకురావాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుంచి ప్రారంభమై బీటీఎస్, రాష్ట్రపతి రోడ్డు, గడియారం సెంటర్, హైదరాబాద్‌రోడ్డు, రామగిరి మీదుగా మేకల అభినవ్ స్టేడియానికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మోసపూరిత ఆలోచనలతో రద్దు చేసిన మూడు వ్యవసాయ చట్టాలను మరో రూపంలో అమలు చేసేందుకు సిద్ధపడుతుందని ఆరోపించారు. రైతు విమోచన చట్టం, విద్యుత్ సంస్కరణల చట్టాలను రద్దు చేసి, పంప్‌సెట్లకు మీటర్లు బిగింపు ఆపాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చేవిధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో కున్‌రెడ్డి నాగిరెడ్డి, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, నన్నూరి వెంకటరమణారెడ్డి, కుంభం కృష్ణారెడ్డి, సయ్యద్ హాశం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, సలీం, తుమ్మల పద్మ, మల్లం మహేష్, నలపరాజు సైదులు, మన్నెభిక్షం, కొండ వెంకన్న, జిల్లా అంజయ్య, భీమగాని గణేశ్, బొల్లు రవి, శ్రీకర్, మల్లారెడ్డి, వెంకన్న, మధుసూదన్‌రెడ్డి, లింగయ్య, భిక్షం, రాంరెడ్డి, భూపాల్, నర్సింహ, మారయ్య పాల్గొన్నారు.


నల్లగొండలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు


మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

విద్యార్థి మృతదేహం లభ్యం

- మునగాలలో అదృశ్యం.. పాలేరు రిజర్వాయర్‌లో లభ్యమైన శవం

మునగాల(కోదాడ): మండలంలోని నేలమర్రి గ్రామానికి చెందిన బాషపంగు శ్రీనివాస్ కుమారుడు ప్రణయ్‌కుమార్(18) సోమవారం నుంచి కనిపించకుండాపోయి, గురువారం ఖమ్మం జిల్లా పరిధిలోని పాలేరు రిజర్వాయర్‌లో శవమై తేలాడు. మునగాల ఎస్‌ఐ లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బాషపంగు ప్రణయ్‌కుమార్ ప్రస్తుతం ఐటీఐ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాగా అతడి మానసికస్థితి సరిగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు గతంలో విజయవాడలోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఇదిలా ఉండగా ప్రణయ్‌కుమార్ సోమవారం తన బైక్ తీసుకొని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు రెండు రోజులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే మంగళవారం ప్రణయ్‌కుమార్ బైక్, సెల్‌ఫోన్, చెప్పులు మునగాల శివారులో గల సాగర్ ఎడమ కాలువ ఒడ్డున కనిపించడంతో కాలువలో దూకి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని భావించిన కుటుంబ సభ్యులు కాలువ వెంట వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో గురువారం పాలేరు రిజర్వాయర్ వద్దకు చేరుకోగా రిజర్వాయర్‌లో ప్రణయ్‌కుమార్ మృతదేహం లభించింది. మృతదేహాన్ని రిజర్వాయర్ నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పురుగు మందు తాగి రైతు ఆత్మహత్యాయత్నం

మిర్యాలగూడ: భూతగాదాలతో రైతు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన మాడ్గులపల్లి మండలంలోని కల్వలపాలెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వలపాలెం గ్రామానికి చెందిన చింతకాయల సైదులుకు, తన వ్యవసాయ పొలం పక్కన రైతులకు బాట విషయమై వివాదం నడుస్తుంది. దీంతో మనస్తాపానికి గురైన సైదులు గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తమ వ్యవసాయ భూమిలోకి వెళ్లటానికి మూసీ కాల్వ వెంట ఉన్న బాటను పక్కన రైతులు దున్ని సాగు చేస్తున్నారని, ఇదే విషయంపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని సైదులు కుటుంబ సభ్యులు ఆరోపించారు. మిర్యాలగూడ ఆస్పత్రిలో బాధితుడిని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పరామర్శించారు.

క్రీడా నిలయాలుగా మారాలి

- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయులు గౌడ్, విప్ సునీత

యాదగిరిగుట్ట రూరల్ : గ్రామాలు క్రీడా నిలయాలుగా మారాలని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఈడిగ అంజనేయులు గౌడ్ అన్నారు. యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో మహేంద్ర యుసేన ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి గ్రేస్‌బాల్ క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో కలిసి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పునాదుల నుంచి క్రీడలు పుట్టాయని, ఆటలైనా, పాటలైనా పదిమంది మాట్లాడితేనే ఇతరులకు తెలుస్తాయన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం ఆటలతోనే సాధ్యపడుతుందన్నారు. యువత గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాలను సద్వినియోగం చేసుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులకు చేయూతనందిస్తామని తెలిపారు. కాగా ఫైనల్‌లో గజ్వేల్, యాదగిరిగుట్ట తలపడగా గజ్వేల్ జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో మదర్ డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, టీఆర్‌ఎస్‌కేవీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ తుంగ బాలు, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేపాక స్వామి, మండల పార్టీ అధ్యక్షుడు కర్రె వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


బహుమతి అందజేస్తున్న ఆంజనేయులుగౌడ్, గొంగిడి సునీత, మహేందర్‌రెడ్డి తదితరులు

స్టేడియాల్లో మెరుగైన వసతులు

ఆలేరురూరల్: పట్టణంలోని ఇండోర్ స్టేడియాన్ని గురువారం రాష్ట్ర స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ ఈడిగ ఆంజనేయులుగౌడ్ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతతో కలిసి సందర్శించారు. స్టేడియాల్లో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఆలేరులోని ఇండోర్ స్టేడియాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. స్టేడియంలో సింతటిక్ ట్రాక్, గ్యాలరీ తదితర సౌకర్యాలు కల్పించాలని సంబంధిత జిల్లా అధికారికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి ధనుంజయ్య పాల్గొన్నారు.

రక్షణరంగంలో అపారంగా ఉపాధి అవకాశాలు

బొమ్మలరామారం: రక్షణ రంగంలో యువత పాత్ర కీలకంగా ఉంటుందని మేఘాలయ రాష్ట్ర ఏడీజీ, రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ జీహెచ్‌పీ రాజు అన్నారు. గురువారం మండలంలోని యావాపూర్‌లో గల యువ డిఫెన్స్ అకాడమీలో గురువారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు, యువత పట్టుదలతో ముందుకెళ్తే సాధించలేనిది అంటూ ఏదీ ఉండదన్నారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. యువ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు రాష్ట్ర ర్యాంక్ సాధిస్తే రూ.50 వేల నగదుతోపాటు, గోల్డ్ మెడల్ తన సొంత డబ్బులతో అందజేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో యువ కళాశాల సీఎండీ పి.వి రావు, డైరెక్టర్ ఎన్.భాస్కర్, ప్రిన్సిపాల్ శాంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.


నగదు అందజేస్తున్న ఐపీఎస్ రాజు

మిరప పంటకు హోమియో చికిత్స

ఆత్మకూరు(ఎం): యాదాద్రి భువనగిరి జిల్లాలో రైతులు సుమారు 200 ఎకరాల్లో మిరప తోటలను సాగు చేస్తున్నారు. ఈసారి రైతులు ఆశించిన ధర ఉన్నప్పటికీ తామరనల్లి, ఎర్ర పురుగు వైరస్ సోకి దిగుబడి సగానికి పైగా తగ్గిపోయింది. వ్యవసాయ అధికారులు చెప్పిన రసాయన మందులు వాడినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. మండలంలోని టి.రేపాకకు చెందిన రైతు బండ యాదగిరి తన మిరప తోటలో సోలార్ లైట్లను ఏర్పాటు చేశాడు. ఈ లైట్లు ఉదయం సూర్యరశ్మితో చార్జింగ్ తీసుకుంటూ రాత్రి వెలుగుతాయి. దీంతో పురుగులు లైట్ వెలుతురుకు ఆకర్షించి లైట్ కింద ఏర్పాటు చేసిన నీటిలో పడి చనిపోతున్నాయి. అంతేకాకుండా హోమియోపతిలో లభించే తూజ-200 లిక్విడ్, మ్యాగోపాస్, కార్బోవేజ్, న్యూట్రిసల్ఫాస్ మందులను 20 లీటర్ల నీటిలో 3ఎంఎల్ కలిపి పిచికారీ చేస్తున్నాడు. ఈ పద్ధతుల ద్వారా మంచి ఫలితం కనిపిస్తుందని రైతు యాదగిరి తెలిపారు.


మిరప తోటలో ఏర్పాటు చేసిన సోలార్ లైట్

విచారణ జరిపించాలి

తిరుమలగిరి: తిరుమలగిరి మండలంలో దళితబంధు పథకంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కమీషన్లు దండుకున్నారని, ఈ పథకంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి లబ్ధిదారులకు న్యాయం చేయాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తిరుమలగిరిలో విలేకరులతో మాట్లాడారు. దళితబంధు పథకంలో మండలంలోని ఒక్కొక్క గ్రామంలో రూ.కోటి నుంచి రూ.రెండు కోట్లు చేతులు మారాయని ఆరోపించారు. దళితబంధు పథకంలో అక్రమాలు నిరూపించకపోతే స్థానిక తెలంగాణ చౌరాస్తాలో ముక్కును నేలకు రాస్తానని సవాల్ చేశారు. సమావేశంలో పేరాల యాదగిరి, పరమేష్, నాగన్న పాల్గొన్నారు.

పొలంలో తిరంగా రెపరెపలు

మండల కేంద్రానికి చెందిన యువ రైతు రైతు ఇమ్మారెడ్డి రాజాబహుదూర్‌రెడ్డి గురువారం తన పంట పొలంలో 74వ గణతంత్ర వేడుకలను నిర్వహించాడు. ఈ సందర్భంగా వరి నాటుతో భారతదేశ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకున్నాడు.

– నూతనకల్


పంట పొలంలో జెండా ఎగురవేస్తున్న రైతు రాజాబహుదూర్‌రెడ్డి తదితరులు

జిప్‌లైన్ ద్వారా జాతీయ జెండా ఆవిష్కరణ

భువనగిరి: పట్టణంలోని రాక్ క్లైంబింగ్ శిక్షణ పాఠశాల ఆధ్వర్యంలో గురువారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా భువనగిరి ఖిలాపై జిప్‌లైన్ ద్వారా 150 ఫీట్ల ఎత్తుపై భారీ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజర్ రాకేష్, అన్విత, అస్పృహ, రామ, నవీన్, విష్ణు, తేజ, బన్నీ పాల్గొన్నారు.


భువనగిరి ఖిలాపై జెండాను ఆవిష్కరిస్తున్న రాక్ క్లైంబింగ్ శిక్షణ పాఠశాల సిబ్బంది

గణతంత్ర సంబురం



యాదాద్రి కలెక్టరేట్‌లో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు


నల్లగొండలో స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


యాదాద్రిలో స్వాతంత్ర్య సమరయోధుడిని సన్మానిసున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


యాదాద్రిలో స్టాల్స్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, భువనగిరి ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి


సూర్యాపేటలో ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో గెలుపొందిన ఎస్పీ టీంకు బహుమతి అందజేస్తున్న కలెక్టర్


సూర్యాపేట కలెక్టరేట్‌లో సాంస్కృతిక నృత్యాలు ప్రదర్శించిన విద్యార్థినులతో కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్


సూర్యాపేట కలెక్టరేట్‌లో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన


పల్లె ప్రగతి స్టాల్‌ను పరిశీలిస్తున్న సూర్యాపేట కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

ఆకట్టుకున్న జాతీయ చిహ్నం




ఢిల్లీ వరల్డ్ స్కూల్‌లో విద్యార్థులు రూపొందించిన జాతీయ చిహ్నం

మిర్యాలగూడ అర్బన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌లో గల ఢిల్లీ వరల్డ్ స్కూల్ విద్యార్థులు రూపొందించిన జాతీయ చిహ్నం ఆకట్టుకుంది. 42 ఫీట్ల వెడల్పు, 58 ఫీట్ల పొడవుతో జాతీయ చిహ్నాన్ని పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బాణావత్ భిక్షానాయక్, ప్రిన్సిపాల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో సామూహిక అక్షరాభ్యాసం

యాదగిరిగుట్ట : వసంత పంచమిని పురస్కరించుకొని యాదగిరిగుట్టలోని యాదగిరిపల్లి శ్రీలక్ష్మీ హయగ్రీవ స్వామి ఆలయం, వేద పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. 250 మందికి పైగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. విద్యాభివృద్ధి కోసం నాలుకపై బీజ అక్షరాలు రాయడం రాసినట్లు ఆలయ నిర్వాహకులు వెల్లడించారు. అంతకు స్వామివారికి అభిషేకం, హోమాది పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మీనృసింహగాయత్రి వేద విద్యా పరిషత్, గాయత్రి ఎడ్యుకేషనల్ ట్రస్టు నిర్వాహకులు పాల్గొన్నారు.


చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న ఆచార్యులు